



# ఓ ఐ.ఎస్.ఐ. కథ

సద్దపల్లె చిదంబరరెడ్డి

రాయలసీమలోని ఓ ప్రభుత్వ కార్యాలయానికి అధికారిగా బదిలీపై వచ్చిన లోకనాథానికి సిబ్బంది మొత్తంపైన సదభిప్రాయం కలిగింది కానీ, అటెండరు లిల్లీని చూస్తే మాత్రం ఒళ్లు మండ సాగింది.

ఎందుకంటే ఆమెకు కళ్లు సరిగా కనబడవు. చెవులు వినపడవు. ఏదయినా ఫైలు అందుకోవాలన్నా, సంతకం చేయాలన్నా చేతులు విపరీతంగా అదురుతుంటాయి. ఎప్పుడూ శెలవు పెట్టడమో, ఆలస్యంగా రావడమో చేస్తూ ఆఫీసులోని ఏ అవసరానికీ అక్కరకు రావడం లేదు.

ఆమెతో ఎట్లా వేగాలో తెలీక సతమతమౌతున్న సమయంలో లోకనాథానికి పై నుండి టప్పాలు వచ్చింది- అందరి సర్వీసు పర్టిక్యులర్స్ అర్జంటుగా పంపమని.

అన్యమనస్కంగా అందరి ఎస్.ఆర్.లు ముందేసుకున్న లోకనాథానికి లిల్లీ ఎస్.ఆర్.లో ఆమె పుట్టిన తేదీయే నమోదు కాకపోవడం గమనించి, ఏం చేయాలో పాలుపోక క్షణంలో స్టాఫ్‌నంతా సమావేశపరచాడు.

విషయం విన్న అందరూ నాలుకలు కరుచుకున్నారు. చేతులు పిసుక్కున్నారు, జుట్టు పీక్కున్నారు, చెవులు కొరుక్కున్నారు. చివరికి- తమ చేతుల్లో ఏమీ లేదు గనక ఉన్న విషయాన్ని పై ఆఫీసుకు తెలియజేయడమే మంచిదని ఉచిత సలహా ఇచ్చారు.

పై అధికారికి నిముషాల మీద టెలిగ్రాం వెళ్లింది. ఇంకా పై అధికారికి విషయం బదిలీ అయింది. చివరికి టప్పాలు మోసుకొచ్చిన విషయమేమిటంటే- ఆమె దగ్గర ట్రాన్స్‌ఫర్ సర్టిఫికేట్ చూసి పుట్టిన తేదీని ఎస్.ఆర్.లో ఎంటర్ చేయమని!!

రెండ్రోజులు వెదికినా టి.సి. దొరకలేదని లిల్లీ చేతులెత్తేసరికి గత్యంతరం లేక ఆఫీసు సిబ్బంది నంతా లిల్లీ ఇంటికి పురమాయించాడు లోకనాథం.

సొంత స్థావరాలేర్పరచుకొన్న బొద్దింకలు, మిడుతలు వగైరా జీవులను నిర్దాక్షిణ్యంగా కల్లోల పరచి, పాత బొంతలు దించి, బీరువాలు స్థానభ్రంశం చేయించి, యుగయుగాలుగా పేరుకుపోయినట్లున్న దుమ్ము దులిపి- ఆ ఘాటుకు దగ్గుతూ, తుమ్ముతూ, చీదుతూ ముక్కులూడిపోయే స్థితికి చేరేసరికి శిథిలావస్థలో వున్న టి.సి. దొరికింది.

టి.సి. దొరికిందన్న సంగతే కాని 'నాం పడా కాంఘోడా' అన్నట్లు అందులో అసలు విషయమే లేదు. పుట్టిన తేదీ నమోదు చేసిన ప్రాంతం మొత్తం ఎలుకలు స్వాహా చేసేసాయి.

చావు తప్పి కన్ను లొట్టపోయినట్లు ఆ టి.సి. మీద స్కూలు, ఊరు పేర్లు మాత్రం స్పష్టంగా అగుపిస్తున్నాయి. అదే పది వేలనుకొని ఆ ఊరు వెతుక్కొంటూ స్వయంగా లోకనాథమే బయల్దేరాడు.

అదో మోస్తరు పల్లె. బస్సు దిగి స్కూలు ఎక్కడ వుండేది వాకబు చేసి, అప్పుడే బడి వదలి

వుండడంతో వేరుగా హెడ్మాష్టరు ఇల్లు వెతుక్కున్నాడు.

సదరు స్కూలు హెడ్మాష్టరు లోకనాథం టి.సి. విషయమై వచ్చాడని తెలుస్తూనే మారు మాట్లాడకుండా కూర్చొమ్మని కుర్చీ చూపించి ఓ పట్టిక ఇచ్చాడు. అది వివిధ తరగతుల టి.సి.ల అమ్మకాలకు సంబంధించిన ధరల పట్టిక!!

అసలు విషయం విచారించకుండా అలా పట్టిక ను ఎందుకిస్తున్నాడో లోకనాథానికి అర్థం కాలేదు.

అది అర్థం కావాలంటే ఇక్కడింకో విషయం తెలుసుకోవాలి.

దాదాపు పదేళ్ల క్రితం లంచం తినని ఓ ఇన్‌స్పెక్టరు గారు ఇన్‌స్పెక్షనుకు రావడానికి మూడ్రోజుల ముందు ఓ ప్రాథమికోన్నత పాఠశాలలోని ఆఫీసులో రాత్రికి రాత్రే మంటలు లేశాయి. ఎన్నాళ్లగానో ఆకలిగొన్న మంటలు కపి కొద్దీ రికార్డులు సొంతం పొట్టన పెట్టుకున్నాయి.

అలా ఎందుకు జరిగింది? అన్నది ప్రస్తుత మప్రస్తుతమనుకొంటే- అప్పటి నుండి ఆ బడి టి.సి.ల ఉత్పత్తి కర్మాగారమైంది. బదిలీల వేలం పాటలో గెలిచి అక్కడికి వచ్చే హెడ్మాష్టరు పాలిట కరెన్సీ నోట్ల అక్షర భాండారమయ్యింది!

ఏదో టి.సి. కొనడానికి వచ్చిన శాల్తీ కాబోలనుకొని సదరు హెడ్మాష్టరు లోకనాథానికి ధరల పట్టిక ఇచ్చాడన్నమాట!

పాత రికార్డులు బూడిదయ్యాయని తెలిసి లోకనాథం గుండెలో రాయి పడినట్లయింది. ఉసూరని తిరుగు ముఖం పట్టి అదే విషయాన్ని పై కార్యాలయానికి విన్నవించుకున్నాడు.

పై అధికారులంతా తమ కార్యకలాపాలు కట్టిపెట్టి, కాన్ఫరెన్సు పెట్టి, లిల్లీ పుట్టిన తేదీ విషయమై తలకాయలు టేబుళ్లకు బాదుకొని ఒక ఆలోచనకు వచ్చి అదే విషయాన్ని లోకనాథానికి పంపారు.

పైవారి ఆజ్ఞ శిరసావహించిన లోకనాథం ఆఫీసు ఖర్చులతో లిల్లీని నగరంలోని ప్రభుత్వ రేడియాలజిస్టు (ఎక్స్-రే ద్వారా శాస్త్రీయంగా వయస్సును నిర్ణయించే వైద్యుడు) దగ్గరికి పంపాడు.

డబ్బు మహిమో లేక అతగాడి చదుశ్శులమో తెలియదుగాని రేడియాలజిస్టు పరీక్షించి నిర్ణయించిన వయస్సు చూసిన లోకనాథంకు నార్మల్‌కు మించిన అంతో ఇంతో బి.పి. ఉండివుంటే 'ఢాం' అని బార్డ్లు తన్నేసేవాడేకాని, గట్టిగా ఉండి బతికి పోయి, లేగనుకొని పామును పట్టుకొన్న చింపాంజీలా ఫీలయ్యాడు.

"30 ఏళ్ళ కూతురున్న లిల్లీ వయస్సును 26 ఏళ్ళుగా నిర్ణయించడం సమంజసంగా లేదనీ, అలాంటి తప్పుడు సమాచారాన్ని ఐదారేళ్ళలో రిటైర్ కాబోతున్న తాను చేతులారా ఎస్.ఆర్.లో నమోదు చేయలేననీ, కావాలంటే తమరే ఆ పని చేయవచ్చుని" కవరింగ్ లెటర్ రాసి ఏస్.ఆర్.తో సహా పై కార్యాలయానికి పంపించాడు.

పై ఆఫీసుకు చేరిన సేవా పుస్తకం తర్జనభర్జనలతో టేబుళ్ళు, ఫైళ్ళు, చేతులు, సెక్షన్లు మారుతూపోయి, దారి తప్పి ప్రభుత్వ కార్యాలయాల పనితనాన్ని ప్రతిబింబిస్తూ మటుమాయమయ్యింది.

తన వయస్సు నిర్ణయిస్తూ ప్రభుత్వ వైద్యులే సర్టిఫై చేశారని, సేవ పుస్తకం కూడా గౌరవనీయులైన అధికారులే కావాలని దాచిపెట్టి జీతం ఇవ్వకుండా తన జీవితంతో చెలగాటమాడుతున్నారని ఆమె నిరాహారదీక్ష బూనింది.

అసలే రాయలసీమ! అందులో మే నెల ఎండలు మండిపోతున్నాయి. పార్లమెంటు ఎన్నికలు నిప్పులు చెరుగుతున్నాయి. అంతవరకూ ఎవ్వరికీ తెలీని లిల్లీ ఆ ఊళ్ళో ముఖ్యమైన చర్చనీయాంశమై వచ్చిపడింది. ఇక రాజకీయ నాయకుల చొరవ గురించి చెప్పాల్సిన పనేలేదు!! ఆమె పుట్టుపూర్వోత్తరాలు గురించి వెదకసాగారు.

* * *

పిటపిటలాడే వయస్సులో, పరువాలు ఉరకలు వేసే సమయంలో శైలాకు స్త్రీ పురుషులనే భేదాలు తప్ప, వారిలో కులమతాలనే కుత్సిత వాదాలున్నాయని గుర్తుకురాలేదు. అందుకే రిక్షా తొక్కే రంగడితో ఆనందం పంచుకొంది.

ఆ విషయం తన వారికి తెలిసి రంగడి నుంచి దూరం చేయబోతే రాత్రికి రాత్రే వాడితో దూరంగా పారిపోయింది.

ఒక చర్చిలో ఫాదర్ దగ్గర ఆశ్రయం పొంది శైలా-లిల్లీగా, రంగడు - డేనియల్‌గా మారి పోయారు.

డేనియల్ రిక్షా తొక్కుతుంటే లిల్లీ ఆడపిల్లల హాస్టల్‌లో వాచ్‌మన్‌గా చేరింది.

అలా చాలా ఏళ్ళు చేసింతర్వాత, అంతో ఇంతో చదువుకొన్నది కావడంతో ఆఫీసులో అటెండరుగా నియమించబడ్డం, అప్పుడే సేవా పుస్తకం తెరువడం జరిగాయి కాని — ప్రలోభం వల్లనో, పొరబాటు వల్లనో పుట్టిన తేదీ నమోదు కాలేదన్న విషయం మాత్రం ఇన్నేళ్ళకు గాని బయటపడలేదు!!

* * *

ఇప్పుడు లిల్లీ కేవలం ఒక ఉద్యోగిని మాత్రమే కాదు. ముస్లింల ఆడబిడ్డ. హిందువుల కోడలు పిల్ల. క్రైస్తవ మతస్థురాలు.

సృష్టి, స్థితి, లయ కారకులైన బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల్లాంటి మూడు మతాలు రాజకీయం అనే మత్తు మందు తాగి అరాజకీయాన్ని ఉత్పత్తి చేయసాగాయి.


ముఖ్యమంత్రి కుర్చీ కదిలే ఊపుకు పరిస్థితి చేరుకొనేసరికి పై నుంచి ఆర్డర్ వచ్చింది; ఆమెను డ్యూటీలో చేర్చుకొని జీతం ఇమ్మని!!

లోకనాథానికే కాదు, ఆ కార్యాలయంలో పదవీ విరమణ చేస్తున్న వారికి చెల్లిగా - కొత్తగా చేరేవారికి అక్కగా, ఇంకా లిల్లీ సేవలు చెల్లిస్తూనే వుందికాని, ఆమెనేం చేయాలో ఎవరికీ అంతు చిక్కలేదు, పోయిన సేవా పుస్తకం చిక్కేచావ లేదు.

అయ్యో! ఇదీ ఒక ఇండియన్ స్టాండర్డ్ ఇన్‌స్టిట్యూట్ కథ!!

కడప జిల్లా రాయచోటి *"Teacher Training Institute"*లో జరిగిన — జరుగుతున్న — ఒక యదార్థ సంఘటనను బుక్క పట్నం *Teacher Training Institute* ప్రిన్సిపాల్‌గారు చెప్పగా విని కథాపరమైన కొద్ది మార్పులు చేర్పులతో ఈ కథ రాశాను.

—రచయిత



**చిట్కాలు**

**చలికాలం సబ్బులకు బదులు సున్నిపిండి వాడాలి. గోరువెచ్చటి నీళ్ళలో కొద్ది చుక్కలు కొబ్బరినూనెను వేసి స్నానం చేస్తే చర్మం పగలదు, తెల్లబడదు.**

**- ఆలపాటి**